క్లుప్తంగా

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మదనాపురం: మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి ప్రజలకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించాడు. పర్యావరణ సంరక్షణ కోసం అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీడియోగ్రాఫర్‌కి ఆర్థికసాయం



మదనాపురం: మండలకేంద్రానికి చెందిన వీడియోగ్రాఫర్ మ్యాతరి తిరుపతయ్యకు గత నెల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న తోటి వీడియోగ్రాఫర్లు వారి అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతయ్యకు రూ12,500ల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వీడియో గ్రాఫర్ సంఘం అధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు గోపాల్, నాయకులు వంశీ, శ్రీను, రాజు, మహేష్, రవి, పల్లవి, అల్లావుద్దీన్ ఉన్నారు.

79వ రోజుకు చేరిన స్వీపర్ల సమ్మె

పెబ్బేరు రూరల్: వనపర్తి కలెక్టర్ కార్యాలయం సమీపంలో స్వీపర్లు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 79వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి మాట్లాడుతూ స్వీపర్లు 79 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం అహంకారానికి నిదర్శనం అన్నారు. తమ పేదరికాన్ని ఆసరా చేసుకొని ప్రభుత్వం శ్రమ దోపిడీకి పాల్పడుతుందన్ని ఆరోపించారు. కార్యక్రమంలో ఖాజపాషా, రషీద్, ఖయ్యూం, బాలస్వామి, కురుమన్న, గీత, నాగమ్మ, చంద్రమ్మ పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించండి



ఆత్మకూర్: ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించి ఇచ్చిన హామీని అమలు చేయాలని స్థానిక యువకులు అధికార బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, ఎంపీపీ బంగారు శ్రీను, చైర్‌పర్సన్ గాయత్రి, మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. మంగళవారం స్థానిక యువకులు పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధుల నివాసాలకు వెళ్లి మంత్రి హరీష్‌రావు పర్యటన నిమిత్తం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డివిజన్ ప్రకటన చేయించాలని వారు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆనంద్, వెంకట్రాములు, సూరి, రామ్, బాలు తదితరులు ఉన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



మదనాపురం: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలుర, బాలికల కబడ్డీ పోటీలను నిర్వహించగా.. ఈ పోటీల్లో మండలానికి ఒక్క టీం చొప్పున 14 బాలుర, 14 బాలికల టీంలు పాల్గొన్నాయి. సాయంత్రం వరకు రసవత్తంగా కొనసాగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో మొదటి బహుమతి వనపర్తి మండలం, రెండో బహుమతి పెద్దమందడి టీంలు గెలుపొందాయి. బాలికల విభాగంలో మొదటి బహుమతి శ్రీరంగాపురం గెలుచుకోగా.. రెండో బహుమతి గోపాల్‌పేట టీం సాధించింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేస్తామని, వారు త్వరలో ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగే టోర్నీలో పాల్గొంటారని పీఈటీ రామచంద్రమ్మ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంనారాయణ, ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణయ్య, హెచ్‌ఎం నిర్మలాదేవి, రైతుబంధు జిల్లా సభ్యుడు రవీందర్‌రెడ్డి, గోపాలకృష్ణ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయక్ పాల్గొన్నారు.

మరమ్మతుకు రూ.50 లక్షలా?

- అధికారులపై పుర వైస్ చైర్మన్, కౌన్సిలర్ల మండిపాటు
- అన్యాక్రాంతమైన పార్కులను పట్టించుకోరా?
- టీపీఓను సరెండర్ చేస్తూ కౌన్సిల్ తీర్మానం



సభలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

వనపర్తి టౌన్: మున్సిపాలిటీ సొంత కార్యాలయంలో కొద్దిపాటి మరమ్మతుకు రూ.50లక్షలు ఎలా ఖర్చవుతాయని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మండిపడ్డారు. కౌన్సిల్ అనుమతి లేకుండా రూ. 50లక్షలు ఖర్చయ్యాయని ఎజెండాలో ఎలా చేర్చారని నిప్పులు చెరిగారు. వాకిటి శ్రీధర్ వాదనకు అధికార పార్టీ సభ్యులు పాకనాటి కృష్ణ, బండారి కృష్ణ, కంచె రవి, లక్ష్మీనారాయణ, పి. మహేష్, భువనేశ్వరి గొంతు కలపడంతో సభలో రభస నెలకొంది. పుర సాధారణ సమావేశం మంగళవారం చైర్మన్ గట్టుయాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పుర ఎజెండాలో కార్యాలయ మరమ్మతులకు రూ. 50లక్షలు ఖర్చయినట్లు చేర్చడంపై వివాదం నెలకొంది. ఈ సమయంలో అధికారులు కొన్ని పనులకు చేసిన ప్రతిపాదనలు కౌన్సిల్ సభ్యులకు చూయించినప్పటికీ కౌన్సిలర్లు రూ. 50లక్షల ఆమోదానికి నిరాకరించడంతో ఈ మేరకు ఆ ఎజెండాను పక్కన పెడుతున్నట్లు ప్రకటించారు. ప్లాస్టిక్‌ను వ్యాపారులు వాడితే రూ. 5వేలు, ప్రజలు వాడితే రూ. 500 చొప్పున జరిమాన విధిస్తామని, పట్టణంలో కూడళ్లు, రహదారుల్లో ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తీసుకోకుంటే జరిమాన విధిస్తామని, సెట్ బ్యాక్ వదలకుండా నిర్మాణాలు చేసే వ్యాపార వాణిజ్య సముదాయాలపై చర్యలు చేపట్టే ఎజెండాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ప్రభుత్వ స్థలం పట్టదా..

పుర పరిధిలోని ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతుందని కమిషనర్ విక్రమసింహారెడ్డి దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని అధికార పార్టీ కౌన్సిలర్లు కృష్ణ, కృష్ణ మండిపడ్డారు. స్పందించిన కమిషనర్ స్థలం చుట్టుపక్కల ప్లాట్లు కొన్న యాజమానులు కోర్టుకు వెళ్లారని, అందుకే చర్యలు తీసుకోలేదని చెప్పగా.. కౌన్సిలర్లు లేఅవుట్‌లో అగ్రికోల్డ్ వెంచర్‌లో వదిలిన ఖాళీ స్థలాన్ని కట్టడి చేయడంలో పొంతన లేని సమాధానాలు చెప్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల వెనుక ఉన్న వెంచర్ స్థలానికి కంచె వేసేందుకు కౌన్సిల్‌లో ఎజెండాను ప్రవేశపెట్టారు. సమావేశానికి రాకుండా, ఆక్రమణలపై శ్రద్ధ చూపని టీపీఓ వరప్రసాద్‌ను సరెండర్ చేయాలని కౌన్సిల్ ఏకగ్రీవకంగా ఆమోదించింది. సభ్యురాలు భువనేశ్వరి మాట్లాడుతూ.. జనరల్ ఫండ్‌లో నిధులు లేవంటూ ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సభ్యురాలు సుమిత్ర, జయప్రద మాట్లాడుతూ.. తమ వార్డుల్లో కౌన్సిలర్‌గా తాము సూచించిన పనులు అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ఏమడిగిన పట్టనట్లుగా ఉన్నారని ఆరోపించారు. పుర కార్యాలయంలో పనిచేస్తున్న భాగ్యమ్మ భర్త అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఒక నెల కౌన్సిల్ వేతనం ఇచ్చేందుకు పాలకవర్గం, ఒక రోజు వేతనం ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు అప్పటికప్పుడు 15వ వార్డు కౌన్సిలర్ బండారి కృష్ణ తన సొంతంగా రూ. 5వేలను బాధితురాలు భాగ్యమ్మకు అందజేశారు.

ఖాతాలో డబ్బులు ఉన్నా తీసుకోలేం



కూలీల పోస్టాఫీసు ఖాతాలకు ఎర్రర్ అని చూపుతున్న దృశ్యం

పాన్‌గల్: పోస్టాఫీస్‌లోని ఉపాధి కూలీల ఖాతాల్లో డబ్బులు ఉన్న తీసుకోలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లోని ఉపాధి కూలీలకు సంబంధించి పనులు చేసిన డబ్బులు వారి పోస్టాఫీసు ఖాతాల్లో జమ చేశారు. తమ ఖాతాల్లో జమ చేసిన కూలీ డబ్బులను తీసుకునేందుకు పోస్టాఫీసు వెళితే వారి ఖాతా ఎర్రర్ అని వస్తుండటంతో డబ్బులు తీసుకోలేకపోతున్నామని కూలీలు వాపోతున్నారు. ఇలా ఖాతాల్లో ఎర్రర్ వస్తున్న విషయం ఏన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, పోస్టాఫీసు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఖాతాలో ఇలాంటి సమస్యలు ఉన్న విషయం అధికారులకు తెలిసినా స్పందించట్లేదని కూలీలు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఏపీఓ కుర్మయ్యను వివరణ కోరగా.. ఉపాధి కూలీల ఖాతాల్లో ఎర్రర్ అనే సాంకేతిక సమస్య ఉన్న మాట వాస్తవమేనని, ఈ సమస్యపై పోస్టాఫీసు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. మండలంలో ఇలాంటి ఖాతాలు వందల సంఖ్యలో ఉన్నాయని తెలిపారు. మరోమారు ఈ సమస్యను జిల్లా అధికారులు, పోస్టాఫీసు అధికారులకు విన్నవించి సమస్య పరిష్కారం అయ్యేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే..



రేవల్లిలో మాట్లాడుతున్న నాయకులు

గోపాల్‌పేట: కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేయాలని పొలికెపాడు మాజీ సర్పంచ్ సత్యశీలారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం రేవల్లి మండల కేంద్రంలో కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయభేరి సభను సైతం విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పర్వతాలు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. గోపాల్‌పేట మండల కేంద్రంలో సైతం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

మూర్ఛ వ్యాధిగ్రస్తుడికి ఆర్థికసాయం

రేవల్లి మండలంలోని కేశంపేటకు చెందిన వార్డు సభ్యుడు వెంకటయ్య మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రూ.15 వేలు పంపారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు సత్యశీలారెడ్డి, జైపాల్‌రెడ్డి, సరేష్‌గౌడ్, వెంకటయ్య బాధితుడి ఇంటికి వెళ్లి కుటుంబానికి ఆర్థికసాయం అందించారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామరాజు, శ్రీనివాసులు, మద్దిలేటి, చందు, రాముడు, ఇమ్రాన్, బాలరాజు, పురుషోత్తంయాదవ్ పాల్గొన్నారు.

పందులు తరలించాలని ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మదనాపురం గ్రామస్తులు

మదనాపురం: మండల కేంద్రంలో కొన్ని రోజులుగా ఊర పందులు విపరీతంగా ప్రజలను ఇబ్బందులు గురిచేస్తున్నాయని, వాటిని తక్షణమే తరలించాలని కోరుతూ మంగళవారం సాయంత్రం మదనాపురం గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు మార్లు పందుల పెంపకందారులకు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదని, పందులు విపరీతంగా తిరగడం వల్ల పారిశుద్ధ్యం లోపించి అంటు రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఫిర్యాదులో పేర్కొన్నారు. పందుల పెంపకందారుల నిర్లక్ష్యం వల్లనే గ్రామంలో పందుల స్వైరవిహారం చేస్తాయని మండిపడ్డారు. అధికారులు తక్షణమే స్పందించి పందులను తరలించాలని కోరారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు

పాన్‌గల్: ఘర్షణ విషయంలో ఓ వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దొండాయిపల్లికి చెందిన చెన్నమోని ఎల్లస్వామి మంగళవారం తన వ్యవసాయ పొలం దున్నేందుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా.. మార్గమధ్యలో ఇదే గ్రామానికి చెందిన మండ్ల నర్సింహా పొలం గొడవలను దృష్టిలో ఉంచుకొని ట్రాక్టర్‌పై ఉన్న ఎల్లస్వామిని కిందపడేసి బూతులతో దూషించి దాడి చేసి గాయపర్చారు. గాయపడిన వ్యక్తిని జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారని బాధితుడి భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండ్ల నర్సింహపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పెబ్బేరు రూరల్: దాడి ఘటనలో ఓ వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు వనపర్తి పట్టణ ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. వనపర్తి పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన కంసలి సంతోష్‌కుమార్ ప్రసాద్‌కు చెందిన గోల్డ్‌షాప్‌లో నాలుగేళ్లుగా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం జీతం తక్కువగా ఇస్తున్నావు సరిపోవట్లేదని, ఇప్పటి వరకు చేసిన పనికి జీతం ఇవ్వమని ప్రసాద్‌ను కోరాడు. దీంతో ప్రసాద్ తనపై దుర్భాషలాడుతూ కొట్టాడని సంతోష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, ట్రాక్టర్ ఢీ

గోపాల్‌పేట: ట్రాక్టర్, మారుతి కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వైపు కారు వెళ్తుండగా మండల కేంద్రంలోని బొడ్రాయి వైపు నుంచి చాకల్‌పల్లి వైపుగా ట్రాక్టర్ వస్తుండగా.. ఎన్‌టీఆర్ విగ్రహం సమీపంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్, కారు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి.

దేశం గర్వించే స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఆత్మకూర్: విద్యార్థులు చదువులో రాణించి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆత్మకూర్ ప్రభుత్వ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు సోదరభావంతో మెలగాలని, ప్రైవేటు కళాశాలలకు దీటుగా ర్యాంకులు సాధించాలని, ర్యాగింగ్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అధ్యాపకులు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆట, పాటలు, నాటకాలతో విద్యార్థులు అలరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు టీజే విశ్వేశ్వర్, భాగ్యవర్ధన్‌రెడ్డి, సునీల్, రాఘవేందర్‌రావు, జమ్మన్న, శ్వేత, కురుమూర్తి, వీణ, లలితమ్మ, రాఘవేంద్ర, పావని, బుచ్చయ్య, బాలకృష్ణగౌడ్, రామన్‌గౌడ్, సతీష్, గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలకు అధికారం ఇవ్వాలి



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.విశారధన్ మహారాజు ఆదేశాల మేరకు ధర్మ సమాజ్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో వనపర్తి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్కడి నుంచి పార్టీ నాయకులు ర్యాలీగా వెళ్లి రాజీవ్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. అనంతరం బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఎల్లయ్య మహారాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 7 శాతం లేని అగ్రకులాలు.. 7 రాజకీయ పార్టీలకు నాయకత్వం వహించడం ఏమిటి అని ప్రశ్నించారు. అన్ని పార్టీలు అధినాయకత్వాన్ని బీసీలకు ఇవ్వడంతో పాటు ప్రభుత్వంలో ముఖ్యమంత్రి స్థానాన్ని దళితుడికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కురుమన్న, ఆంజనేయులు, సూర్యప్రకాష్, ఎల్లస్వామి, శాంతన్న, స్వామి, అశోక్, ఈశ్వర్, బలరాం, రామకృష్ణ, నాగరాజు, శేఖర్, బాలపీర్, విజయ్, కురుమన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

వనపర్తి: ఔట్ సోర్సింగ్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఆయా ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేసే ఉద్యోగులు తమ ఉద్యాగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. చాలీచాలని వేతనాలు తీసుకుంటూ.. రెగ్యూలర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ జేఏసీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, పరశురాముడు, భాస్కర్, వహీద్, శ్రీనివాసులు, పవన్‌కుమార్, విజయ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గోపాల్‌పేట: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు గోపాల్‌పేట ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం సాయంత్రం గోపాల్‌పేట నుంచి ఏదుట్ల వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టరును పోలీసులు ఆపి ఇసుక తరలింపునకు సంబంధించిన పత్రాలు చూపించమని కోరారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ యజమాని యాదగిరి, డ్రైవర్ నల్లపోతుల రాంమాజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఘనంగా మద్దెలేశ్వరి మాత బోనాలు



అమరచింతలో బోనంతో ఆలయానికి వస్తున్న పద్మశాలీలు

అమరచింత: పద్మశాలీల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మద్దెలేశ్వరి మాత బోనాల ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక భక్త మార్కండేయ ఆలయంలో పూజలను నిర్వహించి అక్కడి నుంచి అమ్మవారికి బోనాన్ని భక్తిశ్రద్ధలతో ఆలయానికి తీసుకొచ్చారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం చివరి వారంలో మద్దెలేశ్వరి మాత బోనాల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆలయం వద్దకు బోనాన్ని తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి పోటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో విష్ణు, దేవరకొండ లచ్చన్న, ప్రభాకర్, మోహన్, పాండు, ఎంకంపల్లి శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లిలో మంగళవారం పోషమ్మ బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కుంకుమ, పసుపు, పూలు, గంధం, వేపాకు తదితర వాటితో అందంగా అలంకరించిన బోనంలో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని మహిళలు ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. కొందరు కోడి పుంజులు కోసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాల ముందు పూనకాలతో ఊగిపోయారు. సర్పంచు దేవేందర్ ముదిరాజ్ భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు వారికి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ టీచర్లు సెంటర్లను బంద్ చేసి తమ హక్కుల సాధనకు నిరవధిక సమ్మె చేపట్టారు. వారికి సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, గోపాలకృష్ణ, రాములు, బొబ్బిలి నిక్సన్, యూనియన్ అధ్యక్షులు శారద, జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, కవిత, రాధ, రమాదేవి, సునీత, సుమతి పాల్గొన్నారు.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్
బ్రాంచ్ కొత్తకోట, వనపర్తి జిల్లా.
స్వాధీనతా ప్రకటన రూల్ 8 (1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, కొత్తకోట బ్రాంచ్, వనపర్తి జిల్లా యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు 19.06.2023 తేదీగల డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీత: శ్రీ ముంత ఆంజనేయులు తండ్రి ముంత రాములు, శ్రీ ముంత రాములు తండ్రి శ్రీ యం. హనుమంతు, నివాసం: ఇ.నం.18-185, రాఘవేంద్ర కాలనీ, కొత్తకోట మం॥ మరియు టౌన్, వనపర్తి జిల్లా, తెలంగాణ - 509381, ఫోన్: 8143359300, 9949408130, టి.ఎల్. జి.ఏ.ఎస్ లోన్ ఖాతా నెం: 73119970687 వారికి 16.06.2023 నాటికి నోటీసులో తెలిపిన మొత్తం రూ. 1,61,964/- ... వడ్డీ మరియు ఖర్చులను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాల్సిందిగా కోరారు. ...
రుణగ్రహీత/ గ్యారంటార్ సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 (4) క్రింద ... దిగువ సంతకందారు 06.09.2023న స్వాధీనం చేసుకున్నారని ... నోటీసు ఇవ్వడమైనది.
... రూ. 1,61,964/- ప్లస్ 17.06.2023 నుండి వడ్డీ ... ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, కొత్తకోట బ్రాంచ్, వనపర్తి జిల్లా ...
... SARFAESI చట్టంలోని సెక్షన్ 13లోని ఉపసెక్షన్ (8)లోని ప్రొవిజన్లను ...
స్థిరాస్తి వివరణ:
ఆస్తి యజమాని: ముంత రాములు తండ్రి యం. హనుమంతు, సేల్ డీడ్ డాక్యుమెంట్ నం: 3079/2003, తేది: 11-08-2003, ప్రకారం ముంత రాములు తండ్రి యం. హనుమంతు గౌడ్ కు చెంది వుండి, రాఘవేంద్ర కాలనీ, కొత్తకోట మండలం, వనపర్తి జిల్లా, తెలంగాణ, పిన్ కోడ్ 509381 (కొత్తకోట మండలం మరియు టౌన్), వనపర్తి జిలా - 509381 వద్దగల సర్వే నం: 352, 336, 339 లోని 400 చ.గజాల విస్తీర్ణం గల ఇంటి నం: 18-114, 18-115, 18-115/1, 18-115/2 కలిగిన ఇంటి లో ప్లాట్ నం: 50 యొక్క సరిహద్దులు ఉత్తరం: రవీందర్ రెడ్డి ప్లాట్ నం: 46, దక్షిణం: పి. నరసింహా మూర్తి ప్లాట్, తూర్పు: 20 అడుగుల వెడల్పు రోడ్డు, పశ్చిమం: 20 అడుగుల వెడల్పు రోడ్డు.
తేది: 06.09.2023 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: వనపర్తి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కోతులకుంటతండాలో మాట్లాడుతున్న బాలీశ్వర్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలు, కులాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బాలీశ్వర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని కోతులకుంటతండాలో సర్పంచ్ శ్రీనునాయక్ అధ్యక్షతన పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పాలించిన కాంగ్రెస్ చేయని అభివృద్ధిని కేవలం తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. సాగునీరు వచ్చే ప్రసక్తి లేదన్న కాంగ్రెస్ నాయకులకు కళ్ల ముందు కృష్ణమ్మను తీసుకొచ్చిన ఘనత వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి దక్కుతుందని కొనియాడారు. నేడు పల్లెపల్లెకు సాగునీరు అందించి వ్యవసాయం దండుగ అన్న నాయకుల నోటి నుంచి వ్యవసాయం పండుగ అనేలా చేశామన్నారు. ఎన్నికల సమయంలో ఎంతో మంది మాయమాటలు చెప్పి ఓట్లడగడానికి వస్తారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు.



వీపనగండ్లలో..

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని మండల సమైక్య కార్యాలయం ఎదుట వెలుగు కార్యాలయం సిబ్బంది మంగళవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సమైక్య కార్యాలయంలో పనిచేస్తున్న సీసీలు, బుక్‌కీపర్లకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం బుచ్చన్న, సీసీలు వీరయ్య, మాధవస్వామి, బుక్‌కీపర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాలీశ్వరయ్య, నాగన్న, నాయకులు రవీందర్, ప్రసాద్, నాగలక్ష్మి, బేగం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com